

# ఫస్ట్ స్టెప్

- డి.రమారావు

ఉదయం 7 గంటలు. ఇంకా చలిగానే వుంది బయట. మేడమీది గదిలో దుప్పటి ముసుగు పెట్టి వెచ్చగా పడుకున్నాడు రామం. తలుపులు ఎవరో గట్టిగా కొడుతున్నారు. బద్ధకంగా, చలిగా వుంది రామానికి. చప్పుడు ఆగేట్టు కనపడలేదు. ఇక తప్పదనీ విసుగ్గా లేచి తలుపు తీశాడు. సుడిగాలిలా లోపలికి దూసుకొచ్చాడు మోహన్.

"ఒరే రామం! నాకు చాలా అర్జంటుగా డబ్బు అవసరమొచ్చిందిరా. ఒక మూడు వందలు సర్దరా బాబూ!" అన్నాడు.

అసలే కమ్మటి నిద్ర పాడు చేశాడని బాధగా ఉంది రామానికి. పైగా వీడు అప్పు తీసుకుంటే తిరిగి ఇచ్చే రకం కాదు. ఇవ్వకూడదనుకున్నాడు.

"అవతల నా కొంపలట్టుకు నేట్టున్నాయిరా! ఆలోచిస్తునా ్నవేమిటిరా బాబూ!" అంటూ తొందరపెట్టాడు. "ఆఖరి ఆశ నువ్వేరా! నువ్వు లేవంటే నా పని గోవిందే!" అన్నాడు.

పాపం నిజంగానే అవసరముందో ఏమో? మరి మూడు వందలు తిరిగివస్తాయా? అసలు అవసరముందా? ఆ అవసరమేమిటో కనుక్కుంటే? అనుకున్నాడు. రామం. ఛా ! వాడేమనుకుంటాడో ఏమోనని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

రామం ఆలోచనలో పడటం చూసి మోహన్ మళ్ళీ "కాదనకురా బాబూ! నీకు పుణ్యం వుంటుంది" అంటూ దీనంగా మొహం పెట్టాడు.

"అది కాదురా!" అంటూ రామం ఏదో చెప్ప బోయాడు "నువ్వింకేం చెప్పొద్దు. నువ్విస్తున్నావు అంతే!" అన్నాడు మోహన్ జబర్దస్తీగా.

ఇక తప్పదనుకుని కొంచెం అయిష్టంగానే డబ్బు తీసిచ్చాడు. "త్వరగా తిరిగివ్వాలిరా!" అని మాత్రం అన్నాడు రామం.

"ఓ తప్పకుండా !" అంటూ మోహన్ వేగంగా బయటపడ్డాడు.

తుఫాను వచ్చి వెలిసినట్టయింది రామానికి నష్టం కూడా జరిగినట్టనిపించింది.

మళ్ళీ నిద్ర పోదామా? వద్దా? అని ఆలోచిస్తుండగానే అడుగుల చప్పుడయ్యింది. శారదమ్మగారు చేతిలో సంచీతో పైకి వస్తున్నారు. ఆవిడ ఇంటి ఓనరు భూషణం గారి భార్య. ఆవిడ ఆయాసపడుతూ "అబ్బాయ్! లేచావా! ఏమీ అనుకోకపోతే చిన్న పని నాయనా! మా అబ్బాయింకా నిద్ర లేవలేదు. ఆయనేమో పనుందని బయటికెళ్ళారు. ఇంట్లో చిన్న కార్యం తలపెట్టాము. కొంచెం కూరలూ అవీ తెచ్చిపెట్టు నాయనా!" అంటూ లిస్టూ, డబ్బులూ, సంచీ రామం చేతిలో వుంచి సమాధానికైనా చూడకుండా వెనక్కు మళ్ళింది.

రామానికి కోపం వచ్చింది. నేను చెయ్యనని చెప్దామనుకున్నాడు. మళ్లీ ఆవిడేమంటుందో అని నోరు మూసుకున్నాడు. ఇల్లు ఖాళీ చేయమంటుందేమోనని భయపడ్డాడు. ఈవిడెప్పుడూ వ్రతాలు, నోములు, కార్యాలంటూ నాతో కూరలూ, సరుకులూ తెప్పిస్తుంది అనుకున్నాడు చిరాగ్గా. అయినా తప్పదు కదా అనుకుంటూ ముఖం కడుక్కుని బయటపడ్డాడు.

రామానిది ఈ టౌనుకు 50 కిలో మీటర్ల దూరంలో ఉన్న మునగాల. అక్కడ ఇంటర్ పూర్తయిన తరువాత డిగ్రీ కాలేజి అక్కడ లేకపోవటం వల్ల ఈ టౌనుకు రావలసి వచ్చింది. ఈ సంవత్సరమే డిగ్రీలో జాయినయ్యాడు. మేడమీది గదిలో 5 నెలల క్రితం చేరాడు ఒక మిత్రుని సాయం వల్ల. క్రింద పోర్షనులో భూషణంగారి కుటుంబం వుంటుంది. పైన ఎందుకో గాని ఒక్కటే గది కట్టి వదిలివేశారు. అన్ని సౌకర్యాలలో పాటు గాలి పుష్కలంగా వస్తుంది. అన్ని విధాలా అతనికి బాగుంది. బావులేనిదల్లా భూషణం, శారదమ్మ గార్ల వ్యవహారమే!

మార్కెట్‌కు చేరుకున్న రామం ప్రక్కనే వున్న హోటలులోకివెళ్ళాడు. టీ పడితే ప్రాణం లేచొస్తుంది అనుకుంటూ. "రామం ఇటురారా!" అంటూ శంకరం పిలిచాడు. ఇంచుమించు మూలగా వున్న 'టేబిల్ ముందు ఒక్కడే కూర్చుని వున్న శంకరం రామానికి మంచి స్నేహితుడు. కలుపుగోలుగా వుంటాడు. మనిషి నిర్మొహమాటస్తుడు. అతను ఈ వూరివాడే. కాలేజీలో చేరిన మొదటి నెలలోనే వాళ్ళిద్దరూ బాగా క్లోజ్ అయిపోయారు. అతనిలా వుండాలని చాలాసార్లనుకున్నాడు రామం కాని వుండలేక పోయాడు. అందువల్లనే శంకరమంటే రామానికి ఇష్టమేమో కూడా!

రామం అతనికెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. టీ ఆర్డరిచ్చారు. "ప్రొద్దున్నే ఈ సంచీ ఏమిటిరా? మళ్ళీ శారదమ్మగారు డ్యూటీ వేశారా?" అన్నాడు శంకరం. ఇబ్బందిగా నవ్వాడు రామం. "నీ పనులు చేసుకోవడానికి బద్ధకించే వాడివి ఇతరుల పనులు ఓపికగానే చేస్తావు" అన్నాడు. " ఈ పనులు నేను చెయ్యలేనని చెప్పలేకపోతున్నానురా" అన్నాడు రామం.

టీ వచ్చింది. ఇద్దరూ మెల్లిగా సిప్ చేస్తున్నారు. కొద్దిసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు. అప్పుడు శంకరమిలా అన్నాడు. "నిజంగా అవసరమున్నప్పుడు చెయ్యడం వేరు బలవంతంగా అంటగడుతున్నప్పుడు చెయ్యటం వేరు, నీ మొహమాటం, ఇబ్బంది, చిరాకు టైము వేస్టూ తప్ప నీకు వేరు ఫలితముండదు. కనీసం అయ్యో! పాపం సాయ పడుతున్నాడు కుర్రాడు అన్న సానుభూతి కూడా వుండదు నీకు. ఒక రకంగా నువ్వే నీ మొహమాటం కొద్దీ వాళ్ళకు ఇలా పనులు అప్పజెప్పటం నేర్పావు. సరే బయటి పనులలో సాయం చేశావు మంచిదే! ఆవిడ మనుమరాలిని కూడా నువ్వు ఆడించడం ఎందుకు? మరి ఇవన్నీ చేస్తూ పోతే నీ చదువెప్పుడు

చదువుకుంటావు? ఆవిడ నోములు, వ్రతాలు తగ్గించి ఆ పాపను చూసుకోవచ్చు గదా! ఇవి చాలనన్నట్లు ఆ భూషణం గాడొకరు రోజుకొక రెండు గంటలయినా నీ బుర్ర తినేస్తాడు."

"అవునురా శంకరం. అందుకే నాకు గదికి వెళ్ళాలన్నా, సెలవు రోజుల్లో గదిలో ఉండాలన్నా దిగులుగా వుందిరా" అన్నాడు రామం.

"మర్చిపోయాను. ఉదయం మోహన్ వచ్చి మూడు వందలు అప్పుతీసికెళ్ళాడు" అన్నాడు.

శంకరానికి కోపంతో పాటు జాలి కూడా కలిగింది.

"తెలిసి తెలిసి నువ్వెందుకు ఇచ్చావు?" అన్నాడు శంకరం.

"వాడు చాలా అవసరముందన్నాడు"

"వాడికి అవసరం లేనిది ఎప్పుడు? ఎప్పుడూ ఏదో ఒక అవసరమంటూ అప్పడుగుతూనే వుంటాడు. అసలు నీకు బుద్ధి వుండాలి. వాడినని లాభం లేదు" అన్నాడు శంకరం.

"అవునురా! నీవు 'నో' అని అనలేవా? ఎదుటి వాళ్ళు ఏమనుకుంటారో అని భయమా? అనుకుంటే అనుకుంటారు. ఇప్పుడు జరుగుతున్నదేమిటి? బాధ నీకు, పనులు జరిగేది వాళ్లకు. వాళ్లు నీ ఇబ్బంది గురించి ఆలోచించనప్పుడు నువ్వు వాళ్ళ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. శ్రమా, బాధా రెండూ నీకే కదా! ఎదుటి వాళ్ళు మనల్ని అర్థం చేసుకోనప్పుడు మనమే వాళ్ళకు అర్ధమయ్యేలా చెప్పాలి. ఇప్పటికయినా మించిపోయింది లేదు. పరిస్థితులను నీవు కావాలనుకుంటే మార్చుకోవచ్చు. అంతగా కావాలంటే నీకు వేరే గది వెతికి పెడ్తాను" అంటూ శంకరం లేచి బిల్లు చెల్లించాడు. పనుందంటూ వెళ్ళిపోయాడు.

కూరలు తెచ్చి శారదమ్మ గారికిచ్చాడు రామం. ఆవిడ అలవాటుగా 'నిన్ను శ్రమపెట్టాను బాబూ' అంది.

"అబ్బే లేదండీ!" అన్నాడు రామం.

మెట్లెక్కుకూ నిజంగా తనకు శ్రమ కలుగ లేదా? ఇబ్బంది కాలేదా అనుకున్నాడు. మరయితే తనామాట ఎందుకు చెప్పలేకపోయాడు. తనమీద తనకీ చిరకేసింది రామానికి.

స్నానం చేసి భోజనం కొరకు బయటుదేరే సరికల్లా మధ్యాహ్నం ఒంటిగంటయ్యింది. శీతాకాలం ఎండ కొంచెం తీవ్రంగానే వుంది. హోటలు వైపు నడుస్తున్నాడు రామం. భూషణం గారే రామానికి గుర్తువస్తున్నారు. మళ్ళీ ఆయన ప్రసంగం వినాలంటే అతనికి ఎందుకో బాధగా అనిపించింది.

భూషణం గారు రిటైరయిన ప్రభుత్వోద్యోగి ఆయన దేహం లాగా అభిప్రాయాలు కూడా దృఢంగా వుంటాయి. గొంతుకూడా అందుకేమీ తీసిపోరు. సాయంత్రం వరకు ఎలాగోలా కాలక్షేపం. రామం గదిలో వున్నాడంటే చాలు పైకొచ్చేస్తాడు. తన అభిప్రాయాలూ, ఆలోచనలూ, విమర్శలూ వినే శ్రోత దొరికాడని పూర్తి సంతృప్తి ఆయనకు. ఆయన దృష్టిలో పడిన ప్రతి విషయమూ, వ్యక్తీ నిశిత పరీక్షకు గురౌతారు. చీల్చి చెండాడబడతారు. రామం మాత్రం చాలా ఇబ్బందిగా ఫీలౌతాడు. తనకేదో శిక్ష వేస్తున్నట్టుగా అనిపిస్తుందతనికి. చాలా సార్లు అతను గాలి, వెలుతురు లేచి చీకటి కొట్లో వున్నట్టుగా ఫీలౌతాడు.

సాయంత్రం కాగానే "ఏమిటోయి ఈ రోజు కాలేజీ విశేషాలు?" అంటూ మొదలుపెడ్డారు భూషణం గారు. రామానికి చెప్పే అవకాశమెప్పుడూ వుండదు. వినాలంతే! బయటికి వెళ్దామంటే "చదువుకునే కుర్రాళ్ళు ఊరికే అలా తిరగకూడదోయ్! చెడిపోతారు" అంటూ రామాన్ని బయటికెళ్ళనిచ్చేవారు కాదు. ఈ విదంగా ప్రతిరోజూ గంటో రెండు గంటలలో అతని వాగ్ధాటికి బలయ్యేవాడు రామం.



## రన్నింగ్

"నేను పొద్దున్నే చీపురుతో వీధిలోకి పాచి చెయ్యడానికి వెళ్లే సమయం, మీరు మార్నింగు రన్నింగుకి బయలుదేరే టైమూ ఒకటే అవటం చాలా చిరాగ్గా ఉందండీ!" బాధగా అంది భార్య.

"ఏం జరిగింది?" అడిగాడు భర్త.

"నేను చీపురుతో వెంటబడుతుంటే మీరు తప్పించుకోవడానికి పరుగెడ్తున్నట్లు ఉందటండీ ఆ సీను. అమ్మలక్కలు చెవులు కొరుక్కుంటున్నారు!"

**పి.సరోజ** (అమలాపురం)

గదిలోకి వచ్చి పుస్తకం తెరిచాడు రామం. హోటల్లో ఏమి తిన్నాడో చెప్పమంటే బహుశా చెప్పలేక పోవచ్చు. అతనికి మాటి మాటికి తను ఈ 5 నెలలో చేసిన పనులు, తను చేయాలి అనుకుని చెయ్యలేక పోయినవి గుర్తుకు వస్తున్నాయి. శంకరం మాటలు కూడా అతనికి గుర్తువస్తున్నాయి. పరధ్యానంగానే బోజనం ముగించాడు. ఎదురుగా ఉన్న పుస్తకం మీద అతనికి ఏ మాత్రం దృష్టి లేదు. క్రమంగా అతని చిరాకు, కోపము పెరిగిపోతున్నాయి.

ఈ చిరాకు, కోపము ఎవరి మీద? తనమీదే! అసలు తనెందుకు రోజూ ఈ భూషణం గారి బోరును భరిస్తున్నాడు? తనెందుకు అతనికి ఆపండి నేను వినలేకపోతున్నాను అని చెప్పలేకపోతున్నాడు? శారదమ్మ గారికి తను అన్ని పనులు ఎందుకు చేసిపెట్టాలి? అసలివన్నీ తను ఎందుకు చేస్తున్నాడు.

గది ఖాళీ చేయాల్ని వస్తుందని భయమా? వేరెక్కడయినా గదులు దొరకవా? సౌకర్యంగా లేకపోయినా ప్రశాంతంగా వుండొచ్చు కదా! అక్కడ మాత్రం సమస్యలు రావా? మరి అప్పుడు అసలు ఇదంతా ఎందుకు జరుగుతున్నది? తన మొహమాటం వల్లనా? రోజూ మొహమాటమేమిటి? భయమా?

భయమా? నిజంగా తను భయపడుతున్నాడా? అవును. దేన్ని చూసి భూషణం గారి ఆకారాన్నా? గొంతునా? అభిప్రాయాన్నా? మరి భయం తనలో ఎందుకున్నది. తనేమీ తప్పు చేయట్లేదే? భూషణం గారి మాటకు తను ఎందుకు అంత విలువ ఇస్తున్నాడు? అవన్నీ నిజాలేనా? కావచ్చు, కాకపోవచ్చు. మరెందుకు తను విలువ ఇవ్వటం?

రామానికి మెల్లిగా అర్థమవుతూ వుంది. అతనిలా అనుకున్నాడు. ఈ భయం ఇవన్నీ తను మంచివాడుగా గుర్తింపబడాలి. మెచ్చుకోబడాలి అన్న తాపత్రయం వల్ల అందరూ తనని యాక్సెప్ట్ చేయాలి అన్న తపన వల్ల అవును ఇది నిజం. ఇట్లా అందరినీ సంతృప్తి పరచటం వల్ల తనకు ఒరిగిదేమిటి? చిరాకు , అసహనం పెరుగుతున్న భయం, తన మీద తనకు అసహ్యం, కలగడం కూడా మొదలయ్యింది. రామానికి ఎక్కడో చదివిన వాక్యాలు జ్ఞాపకం వచ్చాయి. తనను తను గౌరవించుకోని వాడికి ఇతరులు ఎప్పుడూ గౌరవం ఇవ్వరు అని.

రామం ఒక నిర్ణయానికి వచ్చాడు. తను ఇకనుండి ఎప్పుడూ తనకు ఇష్టం లేని పనులు చేయడు. తనకు ఎవరి మెప్పు అవసరం లేదు. ఇది తన జీవితం- తనకు నచ్చిన రీతిలో బ్రతుకుతాడు ఇల్లా అనుకోగానే అతనికి తలనుండి ఏదో బరువు దింపినట్టయ్యింది.

సాయంత్రం అయింది. రామం ఫ్రెష్‌గా తయారయాడు. గదికి తాళం వేయబోతుంటే భూషణం గారు పైకి వచ్చారు. "ఏమోయి రామం! ఎక్కడికి బయలుదేరావు? ఇట్లా కాలయాపన చేస్తే చదువబ్బదయ్యా! పద పద గది తలుపులు తెరువు" అన్నాడు.

అప్పుడు రామం స్థిరంగా, స్పష్టంగా ఇలా అన్నాడు.

"భూషణం గారూ! నా చదువు గురించి నాకు తెలుసు నా టైము ఎట్లా వేస్టవుతూ వుందో నేను ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు."

గదికి తాళం వేసి వీధిలోకి వచ్చాడు రామం.

వాతావరణం హాయిగా వుంది. అతని మనస్సూ, శరీరం తేలికగా వున్నాయి. ఎక్కడినుంచో సన సన్నగా పూల వాసనలు వస్తూ వున్నాయి.

రామం అనుకున్నట్టుగా భూషణం గారు గది ఖాళీ చేయమని అనలేదు. ●